# సిపిఎం పోరుబాట ను జయప్రదం చేయాలి

...సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కల్లూరి మల్లేష్

**షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి మార్చి 07:** ప్రజా సమస్యల సాధన కోసం సిపిఎం పార్టీ తలపెట్టిన పోరుబాట ను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కల్లూరి మల్లేష్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో వడ్డే మాన్ బాలరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సిపిఎం పట్టణ కమిటీ సమావేశంలో మల్లేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పోరుబాట లో భాగంగా ప్రతి వార్డు లోని ప్రజలను కలిసి ఇంటింటి సర్వే ద్వారా సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారం కోసం మున్సిపల్, రెవెన్యూ కార్యాలయాల ముందు నిర్వహించే ధర్నా లను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులను ప్రజలను కోరారు.

ఆలేరు పట్టణ ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని పేదలకు ఇండ్లు ఇండ్ల స్థలాలు రేషన్ కార్డులు బీడీ కార్మికుల పెన్షన్లు వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ పెన్షన్లు ఇవ్వకపోవడం వలన ప్రజలు నానా అవస్థలు ఎదుర్కోవటం ఆందోళనకరమన్నారు. నియోజకవర్గ కేంద్రమైన ఆలేరు పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా ఉందని మౌలిక వసతుల కల్పనలో పాలకవర్గాలు పూర్తిగా వైఫల్యం చెందాయని దుయ్యబట్టారు. గత సాధారణ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ప్రధానంగా




గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణం, ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు, వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం ఆలేరు పట్టణ ప్రజలకు కలగానే మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో పోరు బాటలో భాగంగా పట్టణంలోని ప్రతి సమస్యను గుర్తించి వాటి సాధన కోసం జరిగే ప్రజా పోరాటాలలో పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఎంఏ ఇక్బాల్, పట్టణ నాయకులు మోరిగాడి రమేష్, సింగిల్ విండో మాజీ చైర్మన్ మొరిగాడి చంద్రశేఖర్, ఘనగాని మల్లేశం, రాజేష్, కాసుల నరేష్, వడ్డేమాన్ విప్లవ్, మాదాని నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ వైద్య సర్టిఫికెట్లు సృష్టించి ఉద్యోగం పొందాలని

# ప్రయత్నించిన నలుగురు అరెస్ట్ రిమాండ్ కు తరలింపు

**షణ్ముఖ వెలుగు ఎల్లారెడ్డి పేట మండల ప్రతినిధి మార్చి 07:** నకిలీ ఇన్ వాల్యూ డేషన్ సర్టిఫికెట్ సృష్టించి కొడుకుకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించే ప్రయత్నం చేసిన ఎల్లారెడ్డి పేట మండలంలోని గొల్లపల్లి పివి సి లో పనిచేస్తున్న వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారి జడ కొమురయ్య ను,అతనికి సహకరించిన కరీంనగర్ కు చెందిన మరో ముగ్గురు వ్యక్తులు చిమ్మల బీరయ్య, మహమ్మద్ అబ్దుల్ బాసిత్ కొత్త పల్లి రాజేశం లను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎల్లారెడ్డి పేట సిఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

సిఐ తెలిపిన వివరాల ప్రకారం ...

గొల్లపల్లి లోని పివిసి లో వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారిగా పనిచేస్తున్న జడ కొమురయ్య లివర్ వ్యాధితో బాధ పడుతున్నానని తనకు మెడికల్ ఇన్వాల్యూడేషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు చేసుకున్నాడు. ఆ దరఖాస్తును జిల్లా కలెక్టర్ వెరిఫికేషన్ చేయించగా కొమురయ్య నకిలీ పత్రాలు సృష్టించి స్టాంపులు, ఎలక్ట్రానిక్ పరికరాలతో ఫోర్జరి డాక్యుమెంట్లు సృష్టించినట్లు జంపాల రాహుల్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ ఐ రమాకాంత్ కు ఫిర్యాదు చేయగా ఎస్ఐ కేసు నమోదు చేసి విచారణ జరిపి కేసు సి ఐ కి అప్పగించారు. నకిలీ సర్టిఫికెట్ల తయారీలో కొమురయ్య దగ్గర కరీంనగర్ కు చెందిన రిటైర్డు తహసీల్దార్ బీరయ్య 3 లక్షలు తీసుకొని తనకు తెలిసిన డిఎంహెచ్వో ఆఫీస్ లో పనిచేస్తున్న కరీంనగర్ కు చెందిన మహమ్మద్ బాసిత్ హుస్సేన్ ను పరిచయం చేశాడు.

మహమ్మద్ భాసిత్ కరీంనగర్ కు చెందిన ల్యాబ్ టెక్నీషియన్ కొత్త పల్లి రాజేశం ను పరిచయం చేశాడు. కొత్తపల్లి రాజేశం తన ల్యాబ్ లో కరీంనగర్ లోని సన్ షైన్ ఆసుపత్రికి చెందిన ప్రిస్క్రిప్షన్ లపై తప్పుడు ధ్రువ పత్రాలు, తప్పుడు రిపోర్టులు, తప్పుడు హాస్పిటల్ కు చెందిన ప్రిస్క్రిప్షన్ ల పై నకిలీ డాక్టర్ ల స్టాంపులు వేసి లేని డాక్టర్ ల సంతకాలు చేసి నకిలీ సర్టిఫికెట్లు సృష్టించినట్లు తేలింది దీంతో నలుగురిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించి తదుపరి విచారణ జరుపుతున్నామని తెలిపారు . నిందితుల




నుండి హాస్పటల్ కు సంబంధించిన నకిలీ ప్రిస్క్రిప్షన్ డాక్యుమెంట్ ,18 నకిలీ స్టాంపులు కంప్యూటర్ మానిటర్ సిపియు,పవర్ కేబుల్ సిస్టం లింకు కేబుల్ లను పోలీసులు స్వాదీనం చేసున్నట్లు సిఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

## వరద ముంపు సమస్య నుండి శాశ్వత పరిష్కారం -కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్





**షణ్ముఖ వెలుగు శేరిలింగంపల్లి ప్రతినిధి మార్చి 07:** డివిజన్ అభివృద్ధిలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ముందుకు పోతున్నామని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. నల్లగండ్ల చెరువు నుండి బిహెచ్ఇఎల్ చౌరస్తా ఇండియన్ గ్యాస్ గోడౌన్ నాలా వరకు ఎస్ ఎన్ డి పీ అండర్ హెచ్ సిటీ లో భాగంగా 28 కోట్లు 45 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా చేపడుతున్న ఓపెన్ డ్రైన్ ఆర్ సిసి బెడ్, సైడ్ వాల్స్ నిర్మాణం పనులను శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాలా ల విస్తరణ పనులతో లోతట్టు ముంపు ప్రాంతాలకు శాశ్వత ఉపశమనం అని పేర్కొన్నారు. ఆర్ సి సి బాక్స్ డ్రైన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి రాబోయే వర్షాకాలంలోపు పరిసర ప్రాంత వాసులకు అందుబాటులోకి తీసుకువచ్చే లా కృషి చేస్తున్నామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు వీరేశం గౌడ్, కాంట్రాక్టర్ నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులకు సన్మానం

**షణ్ముఖ వెలుగు ఎల్లారెడ్డి పేట మండల ప్రతినిధి మార్చి 07:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎల్లారెడ్డి పేట మండల పరిషత్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులను ఎంపీడీఓ సత్తయ్య ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మాన చేశారు. ఈ కార్యక్రమంలో



మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి సత్తయ్య తో పాటు కార్యాలయ సూపరిండెంట్ శ్రీనివాస్, ఈ జి ఎస్ఏపీఓ కొమురయ్య, మిషన్ భగీరథ, ఆర్డబ్ల్యూఎస్ డి ఈ, ఏఈ లు పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వంగపల్లి గ్రామంలో దొంగల బీభత్సం



**షణ్ముఖ వెలుగు కమలా పూర్ మండలం ప్రతినిధి మార్చి 07:** కమలా పూర్ మండల పరిధిలో గల వంగపల్లి గ్రామంలో శుక్రవారం దొంగలు బీభత్సం సృష్టించారు. దేవరాజు శంకర్ ఇంట్లో లక్ష నగదు, తులం న్నర బంగారాన్ని అపహరించు కుపోయారు. పది రోజుల్లో నాలుగు దొంగతనాలు జరగడంతో గ్రామస్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై వీరభద్రం దొంగతనం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. క్లూస్ టీంతో దొంగలను త్వరలోనే పట్టుకుంటామన్నారు

## యువత లోని నైపుణ్యాలను వెలికి తీయడమే క్రీడల లక్ష్యం

-తహసీల్దార్ మురళి కృష్ణ



**షణ్ముఖ వెలుగు శ్రీరంగాపురం ప్రతినిధి మార్చి 07:** శ్రీరంగాపురం మండల కేంద్రంలో రంగనాథస్వామి జాతరను పురస్కరించుకొని హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్ పి ఎల్ 14 క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం రోజు తహసీల్దార్ మురలీకృష్ణ, ఎస్సై రామకృష్ణ ప్రారంభించారు. సందర్భంగా ముఖ్య అతిథులు క్రీడాకారులను పరిచయం చేసుకొని టాస్ వేసి టోర్నమెంట్ ప్రారంభించి, యువత లోని నైపుణ్యాలను క్రీడల ద్వారానే వెలికి తీయొచ్చని,టోర్నమెంట్ లో క్రీడా స్ఫూర్తిని పాటిస్తూ అవాంతరాలు లేకుండా నిర్వహించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎ సిఎస్ చైర్మన్ జగన్నాథం నాయుడు, మాజీ ఎంపీపీ గాయత్రి పృథ్విరాజ్, మాజీ ఎంపీటీసీ ఎల్ల స్వామి,మాజీ ఉప సర్పంచ్ శివ,దాత శ్రీనివాసులు,పిఆర్టియు టిఎస్ మండల అధ్యక్షులు రాజు, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గంగాధర్ యాదవ్ మరియు

## కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ను కలిసిన సినిమాటోగ్రాఫర్ మధుసూదన్



**షణ్ముఖ వెలుగు స్టేట్ బ్యూరో రాము అల్లాడి హైదరాబాదు మార్చి 07 :** బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి , కేంద్రం మంత్రి బండి సంజయ్ కుమార్ ను కరీంనగర్ జిల్లాకు చెందిన సినిమాటోగ్రాఫర్ మధుసూదన్ కోట మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోట మధుసూదన్ ను కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ శాలువా తో సత్కరించారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా పూడూరు గ్రామానికి చెందిన కోట మధుసూదన్ సినిమాటో గ్రాఫర్ గా రాణించడం అభినందనీయమని , తన ఫోటోగ్రఫీ తో సమాజానికి, దేశానికి ఉపయోగపడే సినిమాలు తీయాలని మంత్రి బండి సంజయ్ ఈ సందర్భంగా కోరారు.

అనంతరం సినిమాటోగ్రాఫర్ మధుసూదన్ మాట్లాడుతూ సినిమాకు సినిమాటోగ్రఫీ ప్రాణం లాంటిదని , డైరెక్టర్ ఆలోచనలకు , విజన్ కు అనుగుణంగా కెమెరా పనితనం తోడై నప్పుడే సినిమాలోని ప్రతి ఫ్రేమ్ ప్రేక్షకులను ఆకట్టుకుని అందరి మెప్పు పొందుతుందన్నారు. అసిస్టెంట్ కెమెరామెన్ గా పనిచేసిన తాను , మొదట్లో కొన్ని కమర్షియల్ యాడ్స్ కు సినీ ఫోటోగ్రాఫర్ గా పనిచేయడం జరిగిందన్నారు. మొదటగా సమీరం అనే సినిమాతో సినిమాటోగ్రాఫర్ గా అవకాశం వచ్చిందని , ఆ తర్వాత ఆదిత్య ఓం నటించిన బంది సినిమా కు సినిమా టో గ్రాఫర్ గా పనిచేసినట్లు తెలిపారు. ఈ సినిమాలో కెమెరా పనితనం కనబడుతుందన్నారు. సినిమా నిర్మాతలు , దర్శకులు తమలాంటి కెమెరామెన్ లను, సినిమాటోగ్రాఫర్లను ఎంకరేజ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు.

## ప్రారంభమైన రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు



**షణ్ముఖ వెలుగు శ్రీరంగాపురం ప్రతినిధి మార్చి 07:** శ్రీరంగాపురం మండల కేంద్రంలో ఉత్తర శ్రీరంగం గా ప్రసిద్ధి చెందిన రంగనాథ స్వామి దేవాలయంలో శుక్రవారం రోజు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయని ఆలయ ప్రధాన పూజారి విష్ణు నారాయణాచార్యులు తెలిపారు. ధ్వజారోహణంతో మొదలై వారం రోజులపాటు బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని,పాల్గుణ శుద్ధ పౌర్ణమి రోజు రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని కావున ఈ బ్రహ్మోత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సురేషాచార్యులు ,గోవిందాచార్యులు, కన్నయాచార్యులు ,కిట్టుస్వామి మరియు ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

## హైటెక్ సిటీ పత్రిక నగర్ లోని ఎక్సిటో

# సొల్యూషన్స్ కాల్ సెంటర్ భారీ స్కాం



**షణ్ముఖ వెలుగు స్టేట్ బ్యూరో రాము అల్లాడి హైదరాబాదు మార్చి 07:** పే పాల్ వినియోగిస్తున్న కస్టమర్స్ డేటా చోరీ చేసి స్కాంకు పాల్పడ్డారు నిందితులు. విదేశాల్లో ఉంటున్న కస్టమర్స్ టార్గెట్ గా చేసుకుని ఈ స్కాంకు పాల్పడినట్లు సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. పలువురు ఫిర్యాదుల నేపథ్యంలో మాదాపూర్ హైటెక్ సిటీ పత్రిక నగర్ లో ఉన్న ఎక్సిటో సొల్యూషన్స్ పేరుతో కాల్ సెంటర్ నిర్వహిస్తున్నారు. ఈ కాల్ సెంటర్ పై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు దాడులు చేశారు. సైబర్ నేరగాళ్లు గుట్టు చప్పుడు కాకుండా కాల్ సెంటర్ నిర్వహిస్తుండడం విశేషం. నకిలీ కాల్ సెంటర్ పేరుతో విదేశీయులను సైతం మోసం చేస్తుంది ఈ ముఠా గుజరాత్ రాష్ట్రానికి చెందిన చందా మనస్విని, సహా మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కాల్ సెంటర్ నుంచి భారీగా కంప్యూటర్లు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హ్యాక్ అయిన బ్యాంకు ఖాతాలను సరి చేస్తామంటూ మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. బ్యాంకు ఖాతా, డెబిట్, క్రెడిట్ కార్డులు వివరాలు సేకరిస్తున్న నిందితులు వారి ఖాతాల్లో నగదు కాజేస్తున్నారు. ఈ స్కామ్ కు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

